క్లుప్తంగా

'ఆణిముత్యాలు'కు పురస్కారాల ప్రదానం



పల్లెకోన(భట్టిప్రోలు): పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన పల్లెకోన జెడ్పీ హైస్కూల్ ఆణిముత్యాలకు పురస్కారాల ప్రదానం శనివారం హెచ్ఎం ఈగ మునియ్య అధ్యక్షతన, ఎంపీటీసీ దున్నా తిరుపతిబాబు అతిథిగా నిర్వహించారు. ప్రతిభ చూపిన ఉల్లంగుంట దీప్తి, లక్ష్మీదీపిక, షేక్ సానియాకు నగదు బహుమతులు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి అందించారు. విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రాఘవరావు, శాంతకుమారి, సిందురాణి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు బాధ్యత పెంచుతాయి



బాపట్ల అర్బన్: పురస్కారాలు బాధ్యతలు పెంచుతాయని బాపట్ల ఐసీడీఎస్ పీడీ కె.ఉమా అన్నారు. శనివారం బాపట్ల పట్టణం ఎన్జీ హోంలో లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా, ఏపూరి బ్రదర్స్ ఆధ్వర్యంలో జరిగిన పురస్కార వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సేవ చేసే వ్యక్తులను గుర్తించి వారికి పురస్కారాలు ఇవ్వటం చాలా గొప్ప విషయమన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 30 మందికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ సెక్రటరీ బుచ్చేశ్వరరావు, బాలల సంక్షేమాధికారి వేమ రామాంజనేయులు, సీడీపీఓ శైలజ, శాంతి రూరల్ డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు కనపర్తి రాజారావు, గ్రేస్ ఫౌండేషన్ డైరెక్టర్ శాలెం రాజు, ఏపూరి బ్రదర్ ఫుడ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏపూరి బాబు రావు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

వేమూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వేమూరు ఎస్ఈబీ సీఐ కె.రవీంద్ర తెలిపారు. కొల్లూరు పెసర్లంక నుంచి తెనాలి వెళ్తున్న ట్రాక్టర్లను ఆపి, వేమూరు పోలీసు స్టేషన్‌కు అప్పగించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ

కర్లపాలెం: గ్రీన్‌పీస్ ఆర్గనైజన్ అధ్యక్షుడు పి.ఏసురత్నం పెదగొల్లపాలెం పంచాయతీ గాదె వెంకటరెడ్డి ఎస్టీ కాలనీలోని 50 మంది విద్యార్థులకు శనివారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ అంజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ట్రెజరర్ చిన్నం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశానికి ఆహ్వానం

బాపట్ల అర్బన్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బాపట్ల పట్టణ పరిసర విద్యార్థినులు మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ మాల్యాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ(హిస్టరీ), బీకామ్(కంప్యూటర్ అప్లికేషన్), బీఎస్సీ (మ్యాథ్స్), బీఎస్సీ(బోటనీ), కోర్సులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. వివరాలకు హెల్ప్ లైన్ నెంబర్ 9553039084కు సంప్రదించాలని తెలిపారు.

టెన్త్ టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు

కొల్లూరు : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ స్థానాల్లో నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానోత్సవం కొల్లూరు పాఠశాలలో శనివారం నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ కాశీనాథ్ ముగ్గురు విద్యార్థులకు రూ.30 వేలు నగదు బహుమతులు అందజేశారు. బాలికోన్నత పాఠశాల విద్యార్థిని డొక్కు ధనలక్ష్మి, బాలురోన్నత పాఠశాల విద్యార్థులు అట్లూరి సాయికౌషిక్, యెర్రు హేమంత్ సాయికి రూ. 10 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. హెచ్ఎంలు చావ ఉషాకుమారి, కె.నాగపాపలు, ఉపాధ్యాయులు సూర్యదేవర భరత్‌కుమార్, గుమ్మడి రామ్మోహనరావు, కె.అరవిందకుమార్, దేవాదాయ శాఖ అధికారి వెన్నం వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షా పథకాన్ని విజయవంతంగా నిర్వహించాలి

బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు



మాట్లాడుతున్న డీపీఓ డి.రాంబాబు



మాట్లాడుతున్న తహసీల్దారు మల్లికార్జునరావు

కర్లపాలెం: అర్హత ఉండి ఇప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి, వారికి పథకాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షా పథకాన్ని అధికారులు విజయవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్షా పథకంపై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం సిబ్బందికి, వీఆర్వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పలు సాంకేతిక కారణాల వల్ల గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని, అధికారులు గుర్తించాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, సచివాలయం సిబ్బంది గ్రామ వలంటీర్లతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకోవాలని చెప్పారు. సమస్యను పరిష్కరించటంతో పాటు ప్రభుత్వ పథకాలను మంజూరు చేయాలని చెప్పారు. అర్హత ఉన్న వారిని గుర్తించి ఆగష్టు 1న వారికి పథకాలను అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, హౌసింగ్ ఏఈ అన్వర్ బాషా, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లె: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా ఈ నెల 23 నుంచి జులై 23 వరకు నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ మల్లికార్జునరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులతో శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఎంపీడీవో శివపార్వతి, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నగరం: అర్హత ఉండి, సంక్షేమ పథకాలు అందని వారికి.. సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకొవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు తోడుగా జగనన్న సురక్ష పథకం

బాపట్ల అర్బన్: జగనన్న సురక్ష పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో ప్రజా సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఎంపీడీవో రాధాకృష్ణ అన్నారు. జగనన్న సురక్ష పథకంపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ రాధాకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న సురక్ష పథకం జూన్ 23న ప్రారంభమై జూలై 23 వరకు కొనసాగుతుందన్నారు. ఎంపీడీఓ, తహసీల్దారు ఆధ్వర్యంలో రెండు బృందాలు పథకం అమలు తీరును పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. జగనన్న సురక్ష పథకంలో పరిష్కరించే అర్జీలకు ఎటువంటి ఫీజులు లేకుండా ధృవీకరణ పత్రాలు మంజూరు చేస్తామన్నారు. డెప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఇన్‌చార్జ్ డీఎల్పీఓ శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : ఎంపీడీఓ శేషమాంబ

పిట్టలవానిపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 23న సీఎం జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నెల 23 నుంచి జులై 23వ తేదీ వరకు అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు కావలసిన సర్టిఫికెట్‌లు, ప్రభుత్వ పథకాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ పథకం నిర్వహణకు మండలంలో రెండు బృందాలుగా మండల స్థాయి అధికారులు ఎక్కడికక్కడే క్యాంపులు నిర్వహించి, తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఎవరి సమస్య అయినా తిరస్కరిస్తే.. ఎందుకు తిరస్కరించారనేది ఆ ఫిర్యాదు దారుడి ఇంటికి వెళ్లి వివరించాలని తెలిపారు. బాపట్ల డీఎల్‌డీఏ చంద్రసువార్త మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగింపుగా ఉంటుందని తెలిపారు. ఈవోపీఆర్డీ కె.పద్మజ, తహశీల్దార్ కవిత, గ్రామ కార్యదర్శులు వసుంధరలక్ష్మి, శివకుమార్, వీఆర్వోలు అలపర్తి వెంకటసుబ్బారావు, భూసిమ్మ, వీరనాయుడు, రమేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

కొల్లూరు: సంక్షేమ పథకాలు అర్హతున్న ప్రతి ఒక్కరికి వర్తింపజేయాలన్న సంకల్పంతో నూతనంగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు.. ప్రతి ఒక్కరూ సమన్వయంగా వ్యవహరించాలని కొల్లూరు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణ రావు కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు సంయుక్తంగా ఇంటింటిని సందర్శించి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ నిర్ధారించుకోవాలన్నారు. అర్హత ఉండి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు కానీ, పక్షంలో వారి వివరాలు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. కారణాలు తెలుసుకుని అవసరమైన ధృవపత్రాలను అందజే పథకాలు వర్తింపజేయడానికి అవసరమైన కార్యచరణతో సంసిద్ధులుగా ఉండాలన్నారు. ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే.. శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాలనీల్లో గృహ నిర్మాణాలు ఊపందుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హనుమంతరావు, సర్పంచ్, ఎంపీడీవో

ఐలవరం(భట్టిప్రోలు): వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు ఊపందుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం హౌసింగ్ డేను పురస్కరించుకుని ఐలవరంలోని లే-అవుట్లను ఆయన పరిశీలించారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో గృహ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులతో ఆయన భేటీ అయ్యారు. నిర్మాణాలు చేపట్టకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. స్వయం సహాయక సంఘాల్లో లేనటువంటి మహిళలను గ్రూపులలో చేర్పించి రుణాలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఒంటరి మహిళలు, గృహ నిర్మాణ లబ్ధిదారులు చనిపోతే అర్హులైన వారసుల పేరిట పట్టా ఇప్పించి, గృహ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు తీసుకున్న వలంటీర్లే గృహ నిర్మాణాలు చేపట్టకపోతే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, హౌసింగ్, పంచాయతీరాజ్ ఏఈలు సేతు రామచంద్రరరావు, రావూరి సౌమ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'భూ రక్ష' పథకంతో సమస్యలకు పరిష్కారం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

బాపట్ల అర్బన్: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ అన్నారు. భూ రక్షా పథకంలో భాగంగా శనివారం డ్రోన్ ఫ్లయింగ్ కార్యక్రమాన్ని పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు డ్రోన్ సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. భూ యజమానులకు భూహక్కు పత్రాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీఓ శ్రీలక్ష్మి, సర్వేయర్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమర్‌నాథ్ హత్య అమానుషం



మాట్లాడుతున్న చైర్మన్ శివరామకృష్ణ

చెరుకుపల్లి: విద్యార్థి అమర్‌నాథ్ హత్య అమానుషమని, ప్రతి ఒక్కరూ పార్టీలకు, కులాలకు అతీతంగా ఖండించాలని ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ అన్నారు. మండలంలోని ఉప్పాలవారిపాలెం గ్రామంలో శనివారం మృతుడు అమర్‌నాథ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, మాట్లాడారు. ఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచారన్నారు. హత్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయటంతో పాటు కఠిన శిక్ష పడే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మృతుడు అమర్‌నాథ్ సోదరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే విధంగా ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు భరోసా కల్పించటం జరిగిందన్నారు. ఆయన వెంట గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, ఎంపీటీసీ పీటా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, తాతా వెంకటేశ్వర్లు, బసవయ్య, పాపారావు, ఏడుకొండలు, బాపనయ్య పాల్గొన్నారు.

రైతు పక్షపాత ప్రభుత్వం



సదస్సులో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి

కర్లపాలెం: రాష్ట్రంలో రైతు పక్ష పాత ప్రభుత్వం నడుస్తోందని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, బాపట్ల ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి అన్నారు. కర్లపాలెం గ్రామ సచివాలయ సమావేశ మందిరంలో శనివారం బాపట్ల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సీతారామిరెడ్డి పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలోని రైతులకు కావలసిన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. కౌలు రైతులకు సాగు ధృవీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు. రైతులు తాము సాగు చేసే పైర్లను తప్పనిసరిగా ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. డీడీఏ విజయనిర్మల, వ్యవసాయ శాస్త్రవేత్తలు కృష్ణవేణి, నిర్మళ, ఏడీఏ ఎ.లక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, ఏవో సమంత్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకులకు పురస్కారం

భట్టిప్రోలు: పల్లెకోనకు చెందిన గ్రేస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కైతేపల్లి జ్యోత్స్న, వ్యవస్థాపకులు కైతేపల్లి షాలేమ్‌రాజ్ జాతీయ సామాజిక విశిష్ట సేవా భూషణ్ పురస్కారం, నేషనల్ ఐకాన్ అవార్డులు అందుకున్నారు. శనివారం బాపట్ల ఎన్జీవో హోంలో లిటిల్ చాంప్ అకాడమి, టీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, అకాడమి డైరెక్టర్ బుచ్చేశ్వరరావు అవార్డులను ప్రదానం చేశారు. 2012లో పల్లె కోనలో గ్రేస్ ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఫౌండేషన్ నిర్వాహకులకు గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను అందుకున్నారు.

వలంటీర్ కుటుంబానికి మంత్రి పరామర్శ




అద్దేపల్లి(భట్టిప్రోలు): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భట్టిప్రోలు వలంటీర్ చాట్రగడ్డ దీపిక కుటుంబ సభ్యులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున శనివారం పరామర్శించారు. అద్దేపల్లిలో దీపిక సంస్మరణ కార్యక్రమంలో మంత్రి నాగార్జున పాల్గొని, సంతాపం తెలిపారు. ఏడాది వయస్సు ఉన్న బాబుకు, ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చూస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. మృతి చెందిన దీపిక సోదరుడికి వలంటీర్ పోస్ట్ ఇప్పిస్తానన్నారు. అలాగే తన వంతుగా మంత్రి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్ ఆ కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు తన వంతుగా అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, వార్డు సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్, పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షులు పీజీ అరుణ్ శాస్త్రి, మండల కార్యదర్శి వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు సయ్యద్ నబీ, తలకొల యలమంద, దారా చెన్నయ్య, వేల్పూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టో..పట్టు..హైలెస్సా..!



కొల్లూరు:మురుగు కాల్వలోకి దిగడంతో ఆర్టీసీ బస్సు .. మూడు గంటలకు పైగా నిలిచిపోయిన ఘటన కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రేపల్లె నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సు ఉదయం 8 గంటలకు కిక్కిరిసిన ప్రయాణికులతో కొల్లూరు బస్టాండ్ సెంటర్ నుంచి బయలుదేరింది. కొంచం ముందుకు వెళ్లగానే ఇరుకుగా ఉన్న తెనాలి-రేపల్లె మార్గంలో ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇచ్చేందుకు డ్రైవర్ బస్సును పక్కకు పోనిచ్చాడు. ఈ క్రమంలో బస్సు చక్రం సిమెంట్‌తో కట్టిన సైడ్ డ్రెయిన్‌లోకి దిగింది. బస్సు ముందుకు, వెనక్కు కదలకుండా మొరాయించింది. ప్రయాణికులతో పాటు, స్థానికులు బస్సును బయటకు లాగేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో చేసేది లేక ప్రయాణికు ఇతర బస్సులను ఆశ్రయించారు. స్థానికులు ట్రాక్టర్ ద్వారా బస్సును లాగేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమాయ్యయియ. చివరికు 11 గంటల సమయంలో డంపర్ లారీకి గొలుసులు కట్టి లాగించడంతో మురుగు కాల్వ నుంచి బస్సు బయటకు వచ్చింది.

అప్రమత్తంగా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ



బాపట్లటౌన్: వాహనచోదకులు అప్రమత్తంగా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించడంతోపాటు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తూ ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్లకు, హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేస్తున్న ద్విచక్రవాహనదారులకు, సీటుబెల్ట్ లేకుండా వాహనాలు నడుపుతున్న కారు డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించని వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పదెకరాల వరిగడ్డి వామి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నిజాంపట్నం: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పదెకరాల వరి గడ్డి వామి దగ్ధమైన ఘటన ప్రజ్ఞం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో శనివారం తుంగల వెంకటేశ్వరరావుకు చెందిన వరి గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని, మంటలు చెలరేగాయి. స్థానికులు స్పందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అదుపుకాకపోవడంతో రేపల్లె ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.80 వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.